‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడలను జయప్రదం చేయాలి

కలెక్టర్ లోతేటి శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను జయప్రదం చేయాలని, నిర్వహణకు సచివాలయాల స్థాయిలో క్రీడా బృందాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదుతో కలిసి కలెక్టరేట్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో క్రీడల నిర్వహణకు మైదానాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. క్రీడాకారులకు భోజనం, వసతి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, డీఈఓ కె.శామ్యూల్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి భాస్కర్ నాయుడు, మున్సిపల్ కార్యాలయాల కమిషనర్లు పాల్గొన్నారు.

క్రిస్మస్ ఔన్నత్యం తెలుసుకోవాలి

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



క్రిస్మస్ కేకు కట్‌చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: క్రిస్మస్ ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.శ్యాంప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ గీతాలను ఆలపించారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి బీజే బిన్నీ దేవుని వాక్య సందేశాన్ని వినిపించారు. కేక్ కట్‌చేసి, శుభకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల యెజ్రా, డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, సూక్ష్మ సేద్యం జిల్లా అధికారి ఆంజనేయులు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ సంఘం అధికారి రోషన్ జమీర్ బాషా, డీడీఓ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం క్రికెట్ క్లబ్ జట్టు విజయం

నరసరావుపేట: స్థానిక ఎస్‌కేఆర్‌బీఆర్ ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఫుల్ మెంబర్ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14 ఏళ్ల లోపు బాలుర ప్రెసిడెంట్ కప్ పోటీల్లో బుధవారం నెల్లూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్‌పై విజయనగరం క్రికెట్ క్లబ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్ జట్టు క్రీడాకారులు 33.3 ఓవర్లలో 112 పరుగులకు ఆల్ అవుట్ అయ్యారు. నెల్లూరు క్లబ్ జట్టులో గురు అత్యధికంగా 34 పరుగులు చేయగా, విజయనగరం క్రికెట్ క్లబ్‌లోని రోహిత్ ఐదు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన విజయనగరం క్రికెట్ క్లబ్ క్రీడాకారులు 32.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయానికి కావల్సిన 114 పరుగులు సాధించారు. ముఖేష్ 28 పరుగులు చేయగా, మన్విత్ అజేయంగా 23 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయానికి కారణమయ్యా రు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



సాధికారిత ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు

నరసరావుపేట: విద్యాభివృద్ధికి పాటుపడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు విద్యార్థులందరూ సమాయత్తం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల నుంచి విద్యార్థుల సాధికారిత జగనన్నతోనే సాధ్యమంటూ వందలాది మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి లోకం మొత్తం మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఇంగ్లిష్ మీడియం, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా దీవెన లాంటి పథకాలు అమలు చేస్తూ విద్యాభివృద్ధికి సీఎం కృషి చేస్తున్నారని కొనియాడారు. దీంతోపాటు సివిల్స్ సిద్ధమయ్యే విద్యార్థులకు లక్ష రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా 18 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారని గుర్తుచేశారు. విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. సీఎం జగన్ కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్య అందిస్తున్నారని, చదువుకుంటామంటే డబ్బులిచ్చే సీఎం దేశంలో ఆయనొక్కరేనన్నారు. విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శులు గుజ్జర్లపూడి ఆకాష్, మణికంఠరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి గోగుల మనోహర్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు సిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

బరి తెగించి.. పేదోడి గూడు కూల్చి..!



టీడీపీ నేత కూల్చివేసిన గుడిసెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

- కొత్తపాలెంలో బరితెగించిన తెలుగు తమ్ముడు!
- బీసీ సామాజిక వర్గం వారిపై దాడులు
- ఇంట్లో సామగ్రి బయట పడేసి మరీ దాడి
- ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే అది తనదంటూ ప్రచారం
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): టీడీపీకి చెందిన ఒక నాయకుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లను కూల్చేశాడు. అక్రమంగా తన పొలంలో నివాసం ఉంటున్నాడని, ఆ స్థలం తనదేనంటూ విచక్షణరహితంగా పూరిపాకను ధ్వంసం చేయడమే కాకుండా ఇంట్లోని సామగ్రి బయటకు విసిరిపడేశాడు. మండలంలోని కొత్తపాలెంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చల్లా బొర్రయ్య, వెంకటయ్యలు వడ్డెర కాలనీలో చిన్న పూరిపాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాయన వెంకటేశ్వర్లు తన భూమిలో గుడిసె వేసుకుని ఉన్నారంటూ బొర్రయ్య ఇంటిని నేలమట్టం చేశాడు. పక్కనే మరో ఇంట్లో ఉన్న వెంకటయ్య కుటుంబ సభ్యులను నానా దుర్భాషలాడి బెదిరించాడు. ప్రభుత్వం ఇచ్చిన భూమిలోనే తాము నివాసం ఉంటున్నామని బాధితులు ఎంత చెప్పినా వెంకటేశ్వర్లు వినిపించుకోకుండా ఇంట్లోని సామగ్రిని బయట పడేశాడు. వెంకటేశ్వర్లు తమపై దౌర్జన్యం చేస్తున్నాడంటూ గతంలోనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు సర్వే చేసి వారు నివాసం ఉంటున్న స్థలాలు 1986లో ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చినవని, ఈ భూమితో వెంకటేశ్వర్లుకు ఎలాంటి సంబంధం లేదని తేల్చారు. దీంతో తనపైనే ఫిర్యాదు చేస్తారా అని రెచ్చిపోయిన వెంకటేశ్వర్లు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారి కుటుంబాలపై దాడి చేసి ఇంటిని కూల్చివేయించాడు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. ఆయన వెంట రూరల్ సీఐ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లు తోపాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

> **బాధితులకు అండగా ఉంటాం..**
>
> నియోజకవర్గంలో టీడీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గ్రామాల్లో బీసీ సామాజిక వర్గాలను బెదిరిస్తూ ఇలాంటి చర్యలు పాల్పడటం దారుణం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటా, పార్టీ కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.
>
> – బొల్లా బ్రహ్మనాయుడు, వినుకొండ ఎమ్మెల్యే

స్టార్ రేటింగ్ గృహోపకరణాలతో ఇంధన పొదుపు

అవగాహన ర్యాలీని ప్రారంభించిన జేసీ శ్యాంప్రసాద్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: ప్రజలందరూ స్టార్ రేటింగ్ కలిగిన గృహోపకరణాలు వాడుతూ ఇంధన పొదుపు పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ కోరారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్డీఓ కార్యాలయం నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పచ్చజెండా ఊపి ర్యాలీని జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రతి ఏడాది డిసెంబరు 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ స్టార్ రేటింగ్ ఉన్న గృహోపకరణాలు వాడాలని, అవసరం లేని చోట లైట్లు స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు, కో–ఆర్డినేటర్ ఆర్.బంగారయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్
- నాదెండ్ల నూతన సమాఖ్య ఎన్నిక



నాదెండ్లలో మాజీ అధ్యక్షురాలు సౌజన్యను సన్మానిస్తున్న పీడీ బాలునాయక్, ఎంపీపీ రాణి

నాదెండ్ల: మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం సాధారణ సమావేశం నిర్వ హించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ఏపీఎం సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా పాడి పెంపకందారులకు అందిస్తు న్న చేయూతతో గణనీయ ఆదాయం లభిస్తుంద న్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు సబ్సిడీపై రుణాలు, దాణా కొనుగోలుకు, పశుగ్రాసం పెంపకానికి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలను లక్షాధికారులు చేయాలన్నదే ప్రభు త్వం లక్ష్యమన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, చేయూత పథకాలపై ఆయన వివరించారు. అనంతరం కొత్త మండల సమాఖ్య ఎంపిక చేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతనంగా ఎంపికై న అధ్యక్షురాలు తలతోటి సుజాత (తూబాడు), కార్యదర్శి షేక్ గౌసియా (సాతులూరు), సంయుక్త కార్యదర్శి మోహిని పద్మజ (గణపవరం) బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇప్పటి వరకూ పనిచేసిన అధ్యక్షురాలు సౌజన్య (చందవరం), కార్యదర్శి మార్తమ్మ (జంగాలపల్లి) సంయుక్త కార్యదర్శి శ్రీదేవి (గణపవరం)లను శాలువాలతో సత్కరించారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, పల్నాడు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనూష, తహశీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ హాజరయ్యారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ముమ్మరంగా మంచి శనగ విత్తనాలను పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన మిచాంగ్ తుపానుకు శనగపంట పూర్తిగా దెబ్బతినడంతో ప్రభుత్వం రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి

ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

నాదెండ్ల: ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరి దరిచేరితేనే పథకాల లక్ష్యం నెరవేరుతుందని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని అప్పాపురం, అమీన్ సాహెబ్‌పాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు నెల్లూరి ఆదినారాయణమ్మ, కామినేని లలితా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. పథకాలను అర్హులైన లబ్ధిదారుల దరి చేర్చేందుకు స్థానిక అధికారులు కృషి చేయాలన్నారు. అర్హులైన గృహిణులకు ఉజ్వల పథకం ద్వారా గణపవరం భారత్‌గ్యాస్ ఏజెన్సీ వారు గ్యాస్ కనెక్షన్‌లను అందించారు. వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పొలాలకు పురుగు మందులు, ఎరువులు పిచికారీ చేసే డ్రోన్‌ను పరిశీలించారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో డ్రోన్‌ను అందుబాటులో ఉంచిందని, ఆసక్తి గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బి లక్ష్మీనారాయణ, ప్రశాంతి, ఎంపీటీసీ నెల్లూరి హరిబాబు, కోఆప్షన్ మెంబర్ మూసా షేక్, ఎంఈవో ఆంజనేయులు, గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్‌నాయక్, ఏవో హరిప్రసాద్, మండల పశు వైద్యాధికారి ఏడుకొండలు, బీజేపీ జిల్లా కార్యదర్శి కస్తూరి వెంకటేశ్వర్లు, నాయకులు తాడిపర్తి జయరామిరెడ్డి, వైసీపీ నాయకులు షేక్ సుభానీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది ఉత్తీర్ణతలో జిల్లాను ముందుంచాలి

ఉపవిద్యాశాఖ అధికారి వేణుగోపాల్



లింగారావుపాలెంలో సమీక్షిస్తున్న డీవైఈవో కె వేణుగోపాల్

యడ్లపాడు: పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణతలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాల్ చెప్పారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వార్షిక తనిఖీలోల భాగంగా బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పనితీరు, విద్యా బోధన తదితర అంశాలపై పరిశీలన చేశారు. రికార్డులను తనిఖీ నిర్వహించి ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రణాళిక బద్ధంగా చదివించాలన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

నరసరావుపేట: రాష్ట్రంలోని ప్రజలందరి ఆరోగ్య భద్రతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దత్తత తీసుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని ప్రకాష్‌నగర్ పదో వార్డు సచివాలయ పరిధిలోని సతీష్‌రోడ్డు కూడలిలో మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి సారథ్యంలో ప్రభుత్వం విడుదల చేసిన నూతన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని ప్రారంభించారు. ముదిరాజు కార్పోరేషన్ డైరక్టర్ ఇయం .స్వామి అధ్యక్షతన నిర్వహించిన సభలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, మాదిగ కార్పొరేషన్ డైరక్టర్ కందుల ఎజ్రా, డాక్టర్ ఆశాలత, నాయకులు వి.సుబ్బారెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, వంపుగుడి జాన్, వైస్ ఎంపీపీ వెంకటప్పారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, వలంటీర్లు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వేల్పూరులో శనగ విత్తనాల పంపిణీ

శావల్యాపురం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు సొసైటీ కార్యాలయంలో పంట నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను సందర్శించి పారదర్శకంగా నష్టపోయిన పంటల అంచనాలు నమోదు చేశారన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో నష్టపోయిన రైతుల జాబితాల ప్రదర్శనలో ఉంచామన్నారు.

ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 22లోగా వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకు రావాలని కోరారు. శావల్యాపురం మండలంలో 1724 ఎకరాల్లో పంట నష్టం, 703 మంది రైతుల జాబితాను అధికారులు సిద్ధం చేశారన్నారు. వేల్పూరులో అత్యధికంగా 412 మంది రైతులకు సంబంధించి 950 ఎకరాలకు పంట నష్టం జరిగింది. పొట్లూరులో 64 మంది రైతులకు సంబంధించి 127 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కారుమంచి 65 మంది రైతులుకు సంబంధించి 205 ఎకరాల్లో, మటుకుమల్లి 31 మంది రైతులకు సంబంధించి సుమారుగా 67 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కొత్తలూరు 128 మంది రైతులకు సంబంధించి 374 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మండలానికి 800 క్వింటాళ్ల శనగలు ప్రభుత్వం నష్టపోయి రైతులకు 80 శాతం రాయితీపై అందజేస్తుందన్నారు. అనంతరం రైతులకు 20 కేజీల శనగల బ్యాగ్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రత్నప్రభ, ఎంపీపీ ఎం.సుహాసిని అనిల్‌కుమార్, కారుమంచి సొసైటీ చైర్మన్ బి.వెంకటశివ, ఏడీఏ బోయపాటి రవిబాబు, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాద్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ టి.వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ చైర్మన్ సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


రైతులకు శనగలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

రైతులకు అండగా జగనన్న పాలన: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: రైతు పక్షపాతి ప్రభుత్వంగా ఏ కష్టం వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తుఫాన్ కారణంగా శనగ పంట నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ కార్యక్రమం మండలంలోని ఇక్కుర్రులో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. తుఫాన్ కారణంగా శనగ పంటకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. నష్టపోయిన రైతులకు సకాలంలో విత్తనాలను సబ్సిడిపై అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం శనగ సాగుకు అదును ఉందని రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, జెడ్పీటీసీ పద ముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాస రావు, ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామి, వైస్ ఎంపీపీ వై.వెంకటప్పారెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఎంపీటీసీ యంపరాల కోటేశ్వర రావు పాల్గొన్నారు.

కోడి వ్యర్థాలతో చేపల సాగు చట్టరీత్యా నేరం

నరసరావుపేట: కోడి వ్యర్థాలతో చేపల సాగు చేయడం పూర్తిగా నిషేధమని పల్నాడు జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం పట్టణంలోని చికెన్ స్టాల్స్ యజమానులతో మత్స్య, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంజీవ రావు మాట్లాడుతూ కోడి వ్యర్థాలతో చేపల సాగు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణంలోని చికెన్ దుకాణాల నుంచి వెలువడుతున్న కోడి వ్యర్థాలతో పట్టణం చుట్టుపక్కల చేపల సాగు చేస్తున్నారన్నారు.

నరసరావుపేటలో నేడు క్రిస్మస్ వేడుకలు

నరసరావుపేట: పట్టణంలోని టౌన్‌హాలులో గురువారం సాయంత్రం ఐదు గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్రిస్టియన్ సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ప్రకటన

[illegible]

పి. రామమోహనరావు, రాము లక్ష్మణ కుమార్, ఎ.రాజరాజేశ్వరి, అడ్వకేట్స్,
డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్: 9392114922

మహిళా సంక్షేమానికి జగనన్న పెద్దపీట

నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం తమదేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం స్వయం సహాయక సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ప్రతీ ప్రభుత్వ పథకం మహిళలకు దక్కేలా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని వివరించారు. ప్రభుత్వ పథకాలతో పాటు అధికార, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వం గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు జగనన్న జన్మదిన వేడుకలు

అభివృద్ధి ప్రదాత, సంక్షేమ రథసారధి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాజేష్‌నాయుడు వెల్లడించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పరిపాలన కొనసాగిస్తున్న సీఎం వై.ఎస్.జగన్ పది కాలాల పాటు చల్లగా ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. గురువారం ఉదయం సీఎం వై.ఎస్.జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జన్మదిన వేడుకల కేక్ కటింగ్, మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం సాయంత్రం గోల్కొండ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

















